

# తోడొకరుండిన....

## - శారద పోలంరాజు



*(గత సంచిక తరువాయి)*

"**చివరగా ఇండియా** నుంచి పై చదువుల కోసం అమెరికాకు వెళ్ళిన గుజరాతీ యువతి షీలాతో వివాహబంధం ఏర్పరుచుకోబోయే సమయంలో వారు హఠాత్తుగా ఇండియాకు రావలసి వచ్చింది. అందుకనే వారి షష్ఠి పూర్తి సందర్భంగా ఆ వివాహ వేడుక కూడా మీరంతా కనులారా తిలకించే అవకాశం కలిగింది. ఇంతటి మహోన్నతమైన వ్యక్తులు మన దేశంలో చాల అరుదుగా కనిపిస్తారు.

సో ఫ్రెండ్స్ లెటస్ ఆల్ గివ్ ఎ స్టాండింగ్ ఎప్లాస్ టు ది గ్రేట్ మాన్." చప్పట్లు కొట్టటం మొదలెట్టింది పూర్ణిమ. వెనువెంటనే రేణుక తరుణి కూడా చేతులు కలిపారు.

ఈ వృత్తాంతం వింటున్న ఆహూతులకు అయోమయంగా వుంది. ఇప్పుడు జరుగుతున్నది సన్మానమా? అవమానమా?

అంతటి ఘన చరిత్ర కలిగిన వ్యక్తి మీద చెప్పులు విసరాలా చప్పట్లు కొట్టాలా అని సందేహంగా వుండిపోయారు ఆహూతులు. మురహరి దంపతుల వెనుకనే నిలుచుని వున్న విదేశీయులు కూడా పూర్ణిమకు జతగా చప్పట్లు కొట్టటం మొదలెట్టేటప్పటికి వాళ్ళందరూ కూడా లేచి నిలబడి చప్పట్లు కొడుతూ ఆ దంపతులను గ్రీట్ చేయటానికి ఒక్కొక్కరుగా స్టేజి మీదకు రాసాగారు.

ఈ హడావుడిలో బిక్కమొహం వేసుకొని నిలబడ్డవారు సందీప్‌తో సహా మురహరి ఇతర కుటుంబ సభ్యులు.

తమ బాధ్యత తీరిపోయిందనుకున్న స్నేహితురాళ్ళు మెల్లిగా అక్కడి నుండి జారుకున్నారు.

వెనక నుండి స్క్రీన్ మీద మురహరి అమెరికాలో జీవిత విశేషాలు ఫొటోలతో పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ కనిపిస్తున్నది.

"కంగ్రాట్స్ కుసుమా. ఇంక నీకు ఈ జన్మకు అతని నుండి విముక్తి లభించింది. ఇంక మురహరి నిన్ను వెన్నాడి పట్టుకుంటాడేమోనని క్షణం క్షణం భయపడనక్కరలేదు. నిశ్చింతగా కాలం గడిపేయవచ్చు."

కార్యక్రమం జరిగిన వారం రోజులకు తరుణి పూర్ణిమతో పాటు రేణుక కూడా కుసుమ దగ్గరకు వచ్చింది.

ఆ నాడు కార్యక్రమంలో జరిగిన సంగతులన్ని లైవ్ టెలికాస్ట్ చూసింది కుసుమ.

అందరూ కలిసి మళ్ళీ వీడియో పెట్టుకొని చూడసాగారు.

"చూడు చూడు. ఎంత గుండెలు తీసిన బంటో. నిజంగా కుసుమా మొదట్లో అతను షీలాను చూడగానే డంగ్ అయిపోయినాడు. కాని వెంటనే తేరుకొని కొత్త పెళ్ళికొడుకులాగా ఆమె భుజాల చుట్టూ చేయి వేసి ఎట్లా ఫోజులిస్తున్నాడో చూడు." ఎక్సైటెడ్‌గా అందరూ కామెంట్ చేస్తూ వీడియో ఎంజాయ్ చేస్తున్నా కుసుమ మాత్రం మౌనంగా వుండిపోయింది.

"హే కుసుమా! ఏమిటి అంత దిగులుగా వున్నావు? జరిగిన సంఘటనతో నువ్వు హాపీగా లేవా?" అనుమానంగా అడిగింది రేణుక.

"రేణూ ఈ ఇంసిడెంట్ తో సందీప్ ఎంత ఇబ్బందికి లోనయ్యాడో ఏమో?"

"కుసుమా! సందీప్ విషయంలో నువ్వేమీ దిగులు పడవద్దు. నీ కొడుకు కోడలు పిల్లలతో సహా ఇంకా కొద్ది సేపట్లో నీ ముందు

వుంటారు. అప్పుడు వాళ్ళనే అడుగుదువు."

"అదెట్లా?"

"ఫంక్షన్ అయిపోయిన మరుసటి రోజు నీ కొడుకు కోడలు మా ఇంటికి వచ్చారు.

అప్పుడు.................

"సారీ సందీప్. మీ దంపతులకు ఇది షాకింగ్ గా వుండి వుండవచ్చు. కాని ఇంత షో చేస్తే తప్ప మీ అమ్మ అసహ్యించుకొని దూరంగా వుండి పోయిన మీ నాన్న నిజస్వరూపం బయటపడేది కాదు.

సందీప్! చూసావా మీ నాన్నఆ రోజుల్లో మీ అమ్మను ఎట్లాగైతే మాయచేసాడో ఈ నాడు మిమ్మల్ని కూడా అట్లాగే చేసాడు.

నీ గుండె మీద చేయివేసుకొని చెప్పు సందీప్. మేము సేకరించిన ఈ వివరాలన్ని నీకు చెప్పితే నువ్వు నమ్మే వాడివా? ఇన్ని సంవత్సరాలూ నిన్ను కళ్ళల్లో పెట్టి చూసుకున్న మీ అమ్మ మాటే అబద్ధం అనిపించేలాగా నటించాడు మురహరి. ఇంక మా మాట మాత్రం నువ్వు నమ్మేవాడివా?"

అవునన్నట్టు తల వూపాడు సందీప్.

"అందుకనే నీకు వాస్తవం తెలియాలి. మళ్ళీ ఒకసారి కుసుమ జీవితం బలి కాకూడదు. అక్కడ అమెరికాలో షీలా జీవితం నాశనం కాకూడదు. ఇన్ని ఆశయాలతో మేము సంసిద్ధులమయినాము. కాకపోతే మీ ఇద్దరికి మీ బంధువుల ముందు ఫ్రెండ్స్ ముందు అవమానం జరిగి వుండవచ్చు కదా?"

"ఆ విషయంలో అంత వర్రీ లేదాంటీ. ఎందుకంటే మా ఫ్రెండ్స్ కొలీగ్స్ కు ఎవరికి మా అమ్మ తెలియదు. ఆమె ఎప్పుడూ ఏ పార్టీకి గాని పెళ్ళికిగానీ రాలేదు. అందుకే వాళ్ళెవరికి చూసే అవకాశం లేదు. అదీకాక పూర్ణిమ ఆంటీ మైక్ ముందర చెప్పిన పద్ధతి చూసిన వాళ్ళకు ఎవరికి కూడా ఎటువంటి అనుమానమూ రాలేదు. పై నుంచి ఇదంతా నేనే ప్లాన్‌చేసాను అనుకొని నేను చేసినది ఒక ఆదర్శ వివాహమని అభినందించి మరీ వెళ్ళారు. కాకపోతే అమ్మను చూద్దామని వచ్చిన బంధువులకు నిరాశ కలిగింది."

"అయినా సందీప్! మీరు ఒక విషయం గమనించే వుంటారు. మొదట్లో షీలాను చూడగానే మురహరి కొద్దిగా షాక్‌తిన్నట్టు కనిపించాడు కాని ఆ తర్వాత ప్రోగ్రాం అంతా కొత్త పెళ్ళికొడుకులాగా ఎంజాయ్ చేసాడని ఆ వీడియో చూస్తే అర్థమవుతున్నది. అంతటి నీచుడు అతను."

పూర్ణిమ ముందుకు వచ్చి, "సందీప్ ఇందులో నీ తప్పేమీ లేదు. పెళ్ళి రోజులని, పుట్టినరోజులని సర్ప్రైజ్లు ఇవ్వటం ఈ రోజుల్లో పిల్లలకు ఒక థ్రిల్. నువ్వు కూడా అదే విధంగా మీ నాన్నను ముందు నిలుచోబెట్టి ఆశ్చర్య పరుద్దామని అనుకున్నావు. కాకపోతే ఇంత పెద్ద విషయంలో నువ్వు ఎవరినైనా సంప్రదించి వుండవలసింది.

నువ్వు మీ నాన్నను ట్రేస్ చేసిన పద్ధతిలో కూడా తప్పేమీ లేదు. ఫేస్‌బుక్ ద్వారా ఎందరెందరో పాత మిత్రులు బంధువులు కలవటం నిజంగా అభినందించతగ్గ విషయమే. అయితే ఈ మాధ్యమం ద్వారా ఎన్నో అనర్థాలు కూడా జరుగుతున్నాయి.

ఫేస్‌బుక్ కొందరిని తమ కుటుంబాలతో కలుపుతుంటే కొందరికి సంసారాలే విచ్చిన్నం అవుతున్నాయని రోజూ వార్తల్లో చూస్తూనే వున్నాము. అది కూడా ఒక ఏటం వంటిది. మంచికోసం రూపొందించిన ఈ మాధ్యమాన్ని జనం తమతమ స్వార్థాలకు ఎట్లా దుర్వినియోగం చేసుకుంటున్నారో మీ నాన్నే ఒక వుదాహరణ. కాకపోతే నీకు కలిగినటువంటి అనుభవం ఇంతవరకు ఎవరికి కలిగి వుండకపోయి వుండవచ్చుననుకుంటాను.

ప్రతి వ్యక్తి తమతమ పూర్వీకుల గురించి, వంశవృక్షం తెలుసుకుందామనుకోవటం గర్హించదగ్గ విషయమే. మనం ఈ రోజు ఇంత

ఎత్తుకు ఎదిగామంటే అది కేవలం మన గొప్పతనమే కాదు. మనలో ప్రవహిస్తున్న మన పెద్దల సంస్కారఫలమే. రూట్స్ నవలలో అదే ప్రతిబింపచేసాడు మహానుభావుడు హేలీ. అదే విధంగా నీకు దూరమైన మీ నాయనమ్మ పెదనాన్నల కుటుంబంతో నువ్వు కలవటం కూడా ఆనందించదగ్గ విషయమే.

కాని నిన్ను ఇంతకాలం కంటికి రెప్పలాగా చూసుకున్న మీ అమ్మ మాట నమ్మకుండా నిన్న కాక మొన్న ఇంటర్నెట్ ద్వారా పరిచయమయిన ఆ మోసగాడి మాటల వలయంలో పడి అతనిని ఇండియాకు పిలిపించి ఆమె మాట కూడా ఖాతరు చేయకుండా ఆమెను మళ్ళీ అతనికి బలి ఇద్దామనుకున్నావు చూసావూ! అది నువ్వు చేసిన క్షమించరాని నేరం.

సందీప్! కుసుమ కావాలని నిన్ను మీ నాన్న కుటుంబంతో కలవకుండా చేసిందని నువ్వు అనుకుంటున్నట్టు మొన్న నీ మాటలబట్టి స్పష్టమయ్యింది.

నువ్వు ఇంకొక్కసారి బాగా ఆలోచించు. మీనాన్న మిమ్మల్ని మీ పాటికి వదిలేసి మూడు దశాబ్దాల పైగా కాలం గడిచిపోయింది. మీ నాయనమ్మకు పెదనాన్న మేనత్తలకు మీరు ఎక్కడ వుంటారో బాగా తెలుసు. మరి, వాళ్ళ ఇంటి వారసుడివి, వాళ్ళ రక్తం పంచుకుని పుట్టిన వాడివి కదా నిన్ను కలవటానికి ఏనాడైనా వాళ్ళు ప్రయత్నించారా? పైగా మూడు నెలల పసికందుతో మీ అమ్మను తన పాటికి తనను వదిలేసి ఆవిడ చక్కాపోయింది. నువ్వు వాళ్ళను ఈ విషయం నిలదీయలేకపోయావా? అంటే నీలో కల్మషం లేని కుసుమ రక్తం ప్రభావం ఎక్కువగా వున్నదన్నమాట.

మీ అమ్మ లాగే నువ్వు కూడా ఆ మాయలో పడిపోయావంటే నువ్వు ఎంత అమాయకుడివో చెప్పకనే చెప్పుతోంది.

దేవుడు మేలు చేసి కుసుమను మేము కలుసుకోబట్టి అనర్థం జరగకుండా ఆగింది. అదే మేము కలవకుండా నువ్వనుకున్నట్టే జరిగిపోయి వుంటే..................అమ్మో ఎంత ఘోరం?" ఆ ఆలోచనే అందరికీ భయం కలిగించేలా అనిపించింది.

వంతులవారిగా స్నేహితురాళ్ళు చెప్పవలసిన నాలుగు మాటలు చెప్పి అతనిలో గూడుకట్టుకొని వున్నగిల్టీ ఫీలింగ్ను కొంత మటుకు పారద్రోలకలిగారు.

అప్పటిదాకా మౌనంగా వాళ్ళ మాటలు వింటూ వున్న మానస తన మనసులో ఇన్నాళ్ళనుండి గూడుకట్టుకొని వున్న సందేహాల బుట్ట బయటికి తీసింది.

"అత్తయ్యగారు అంత మంచి వుద్యోగంలో వున్నారు. సంపాదన కూడా ఏమీ తక్కువలేదు. పైగా ఆవిడ తండ్రి నుండి తాతగారి నుండి సంక్రమించిన ఆస్తి కూడా కాస్తాకూస్తా కాదు. అటువంటి మనిషి ఎంత దర్జాగా బతకాలి? ఆవిడ ఏనాడూ ఒక మంచి నగకాదుకదా, ఒక కాస్ట్‌లీ చీరగాని, తనకంటూ ఒక వస్తువు కానీ ఏర్పరుచుకోలేదు. మాతో ఎంతో ప్రేమగానే వుంటూనే తన పర్సనల్ లైఫ్‌లో ఎవ్వరినీ ఇన్వాల్వ్ అవనిచ్చేవారు కాదు.

ఆదివారం అందరమూ కలిసి వుందామని మేము ఎంతగానో కోరుకునే వాళ్ళము. కాని ఆవిడ మటుకు ఒక్కరే పొద్దున్న అంతో ఇంతో తినేసి బయటకు వెళ్ళిపోయేవారు. ఎక్కడికో మాకు తెలిసేది కాదు. అడగాలంటే సభ్యత కాదు అని ఆయన వూరుకునేవారు. మరి ఇంత ఆదర్శమహిళకు అంత ప్రైవేట్ లైఫ్ ఎందుకు?"

"మానసా. చాల సంతోషమమ్మా. ఇంత పెద్ద అనుమానం మీ అత్తగారిమీద వున్నా కూడా ఆవిడ ప్రైవసీని ప్రశ్నించని సందీప్ సంస్కారంలోనే తెలుస్తున్నది కుసుమ పెంపకంలోని క్రమశిక్షణ.

నిజంగానే నువ్వన్నట్టు కుసుమ చాల గొప్ప ఆదర్శ మహిళ. ఏమీ తెలియని రోజులలోనే తన ఆస్తి మొత్తం అనాథ పిల్లల కోసం ధారాదత్తం చేయటానికి సిద్ధపడింది. అందరు ఆడపిల్లల లాగా ఆనాడే తనకు మంచి బట్టలని నగలని వెంపర్లాడ లేదు. తన వద్ద వున్న నగలన్ని

నీకే ఇచ్చేసినట్టు కూడా మాకు తెలుసు.

ఒక్కసారి కుసుమ బ్యాంక్ పాస్‌బుక్ చూస్తే మీకే తెలుస్తుంది.

తన సంపాదనలో అవసరం వున్నంత వరకే తాను వుంచుకొని మిగతాదంతా సంఘసేవకే వినియోగించిన త్యాగమూర్తి మీ అత్తగారు. సందీప్‌కు తండ్రి లేని లోటు తెలియకుండా అన్ని హంగులతో ఒక మంచి జీవితాన్ని ఇచ్చింది. అతను కోరుకున్న నిన్ను ఇచ్చి వివాహం చేసింది. ఒక మంచి ఇల్లు కట్టించింది. తన చివరి రోజులలో ఒకరికి భారం కాకుండా వుండాలని కొంత మొత్తం తన పేరు మీదనే ఫిక్సెడ్‌లో పెట్టుకున్నది.

సందీప్ నువ్వు ఇద్దరు కూడా సంపాదనపరులే. ఆర్థికంగా ఎవరికి కూడా ఏ లోటూ లేదు. ఇవన్ని ఆలోచించిన తరువాత కుసుమ ఒక అనాథాశ్రమంకి, ఒక వృద్ధాశ్రమంకి నెలనెలా ధనసహాయం చేస్తున్నది. ఇంక ఆదివారాలంటావా? ప్రతి ఆదివారమూ పండుగ రోజులూ అక్కడికి వెళ్ళి వాళ్ళతో సమయం గడిపి వచ్చేది. ఎవరికి కష్టమొచ్చినా తనకే అన్నంత తల్లడిల్లిపోయేది.

మీలో మీరు మధనపడకుండా ఒక్కసారి మీ అత్తగారిని అడిగేసి వుంటే మీకే తెలిసేది కదా! అంటే ఈ విషయంలో ఏమైనా అనుకుంటుందేమోనని మీరు కూడా పరాయివాళ్ళగా భావించి వూరుకున్నారు చూసావా! అది మీరు చేసిన తప్పు.

ఇందులో కుసుమ తప్పు కూడా కొంత వుంది. ఈ విషయాలన్ని మీతో చర్చించవలసింది. అయితే మీ నాన్నకు నాయనమ్మకూ ఇటువంటి సంఘసేవా కార్యక్రమాలంటే గిట్టేవి కావు. వాళ్ళు కుసుమతో కలిసివున్న కొంతకాలంలోనే ఈ విషయమై సాధించేవారని చెప్పింది. చిన్నప్పుడే తనకున్న ఆస్తిలో కొంత భాగం దానధర్మాలకు ఇచ్చేసిందని మీ నాయనమ్మ సూటిపోటి మాటలనేదట. ఆ అస్తినంతా దానం చేయకపోతే ఈ వుద్యోగం అనే బాదరబందీ అంతా లేకుండా హాయిగా బతికేదానివి అంటూ ఎత్తిపొడుపు మాటలు కూడా అనేదట. ఆ అనుభవం దృష్టిలో పెట్టుకొని, మీకు కూడా ఇష్టం వుంటుందో వుండదో అనుకొని చెప్పివుండకపోవచ్చు."

"ఆంటీ అమ్మ ఎక్కడ వున్నది?" నెమ్మదిగా కళ్ళల్లో నీళ్ళు నిండుకుంటుంటే అడిగిన సందీప్‌ను చూసిన స్నేహితురాళ్ళకు జాలేసింది.

"నువ్వు మీ అమ్మ గురించి ఏ మాత్రం విచారించనక్కర లేదు. తను చాల ఆనందంగా వుంది. ఈ శని ఆదివారాలు వీకెండ్ మీ అమ్మతో గడిపేలాగా ఏర్పాటు చూసుకోండి. ఆ రోజు మిమ్మల్ని కుసుమ దగ్గరకు చేర్చేలాగా ఏర్పాటు చేసాను. మా డ్రైవర్ దగ్గరుండి మిమ్మల్ని మీ అమ్మ దగ్గరకు చేరుస్తాడు. అక్కడ మీ అమ్మను చూస్తే ఆమెలో చిన్ననాటి కుసుమ ఎట్లా వుంటుందో ప్రత్యక్షంగా చూడవచ్చు."

అయోమయంగా సందీప్ దంపతులు మొహాలు చూసుకున్నారు.

కుసుమ కూర్చున్న కుర్చీ పక్కన కింద కూర్చొని తల్లి ఒడిలో తలపెట్టుకొని కన్నీరు పెట్టుకుంటున్న కొడుకు తల నిమురుతూ వుండిపోయింది కుసుమ.

"ఏది జరిగినా మన మేలు కోసమే అని పెద్దలు వూరికే అనలేదు. సందీప్! ఇదిగో మీ అమ్మను తిరిగి నీకు అప్పగిస్తున్నాము. ఇంక నీ ఇష్టం మీ అమ్మ ఇష్టం." కుసుమను కొడుకు కోడలితో వదిలి బయటకు వచ్చారు.

"అమ్మా! నీ మొహం చూడటానికి కూడా నాకు సిగ్గుగా వుంది. క్షమించమని అడగటం కూడా నిన్ను అవమానించటమే అవుతోంది."

"లేదు నాన్నా తరుణి చెప్పినట్టు అంతా మన మంచికే. ఈ సంఘటన జరిగి వుండకపోతే నేను నా ప్రాణ స్నేహితురాళ్ళను కలిసేదాన్నా? నీకు జన్మనిచ్చిన మనిషి అసలు రూపం తెలిసేదా? నిన్ననీ రక్త సంబంధీకుల నుండి దూరం చేసానన్న అనుమానాలతో జీవితాంతం మధన పడేకన్నా ఈ విధంగా జరగటం కూడా మన అందరి మంచికే."

"అమ్మా ఇంక ఇక్కడ దాక్కోవటం దేనికి? నువ్వు ఇంక ఇంటికి వచ్చి యధాప్రకారం నీ వుద్యోగం చూసుకోవచ్చుకదా!"

"పిచ్చి నాన్నా! నేను ఇక్కడ భయంగా దాక్కో లేదు. నా చిన్నతనం మళ్ళీ వచ్చినంత ఆనందంగా వుంది."

అప్పుడు వచ్చింది సందీప్ మానసకు అనుమానం. "అమ్మా వస్తూ చూసాను. అన్ని వయసులో వున్న అమ్మాయిలు తిరుగుతున్నారు. బయట పెద్ద గేటు సెక్యూరిటీతో బందోబస్తుతో వుంది. ఎవరుంటున్నారు ఇక్కడ.?"

వివరంగా చెప్పి, "మీరెవ్వరూ నాగురించి దిగులు పడవద్దు. ఇదొక అమ్మాయిల హాస్టల్. నేను ఇక్కడ వారి బాగోగులు చూసుకోవటానికి ఇక్కడే వుంటాను. రెండురోజులు వుంటారుగా. అప్పుడు మీకే తెలుస్తుంది. ఇక్కడ ఎంత ఆనందంగా వున్నానో. ఇంకొక సంగతి. నేను నా బాంక్‌వుద్యోగానికి రాజీనామా చేసాను."

మాటల్లోనే వచ్చారు స్నేహితురాళ్ళు. "అయిపోయినాయా తల్లీబిడ్డల సెంటిమెంట్ ముచ్చట్లు. అయిపోతే అదిగో బయట నీ తక్కిన సంతానం నీ కోసం ఎదురు చూస్తున్నారు." ఆశ్చర్యంగా చూసారు సందీప్ మానస.

"రండర్రా మీ అమ్మ మీ కోసం ఫ్రీగా వుంది." అంటూ బయటకు చూసింది తరుణి.

బిలబిలమంటూ నలుగురైదుగురు అమ్మాయిలు లోపలికి వచ్చారు.

"అమ్మా! ఎంతసేపటికి బయటికి రారేంటీ? ఈ రోజు మాతో షటిల్ బాట్మింటెన్ పోటీ అని చెప్పారుగా! అందరమూ గంట నుండి వెయిట్ చేస్తున్నాము. పదండి పదండి." కుసుమ చేయిపట్టుకొని లాక్కెళ్ళారు వచ్చినవాళ్ళు.

టీనేజి అమ్మాయిలతో సమానంగా బాట్ పట్టుకొని అల్లరి చేస్తూ ఆడుతున్న కుసుమ వైపు విడ్డూరంగా చూస్తూ వుండి పోయినారు కొడుకు కోడలు. "మై గాడ్. ఇంతకాలం వుదాసీనంగా వుంటూ అనారోగ్యంతో బాధపడుతూ వున్న ఆమెలో ఇంత ఎనర్జీ లెవల్సా?"

"ఆంటీ. మీరందరూ వుండబట్టి పెద్ద అనర్థం నివారించగలిగారు. అంత ఆనందంగా అమ్మను చూసేటప్పటికి నా కళ్ళను నేనే నమ్మలేకపోయినాను."

"సందీప్. ఇందులో మా ఘనత ఏమీ లేదు. చిన్నతనం నుండే మేము నలుగురమూ పెరిగిన వాతావరణమూ, మా పెద్దల నుండి సంక్రమించిన సంస్కారమే దీనికి మూలము. ముఖ్యంగా కుసుమే మాకు ఆదర్శం. మీకు మేము ముందరే వివరించాము.

మాకంటూ కొన్ని ఆశయాలు వున్నాయి. వాటిలో ముఖ్యమైనది, ఒక్కరి కోసం అందరం, అందరి కోసం ఒక్కరం అన్నదే.

కాలంలో ఎన్నో మార్పులు వచ్చాయి. పక్క ఇంట్లో ఏదైనా కష్టం వచ్చినా వీధిలో ఏదైనా ఏక్సిడెంట్ చూసినా, ఆ మనకెందుకు ఈ దారే పోయే తద్దినం అనుకొనే రోజులు ఇవి."

"అవును సందీప్, ఇప్పుడు కూడా కుసుమను మీతో తీసుకెళ్ళదామనుకుంటున్నారా?బాగా ఆలోచించుకోండి.

మీరిద్దరూ ఆఫీసులకు వెళ్ళిన తరువాత మళ్ళీ తాను తన ఒంటరితనంతో మగ్గితే బాగుంటుందా? ఏ బాదరాబందీ లేకుండా ఇంత ఆనందంతో ఆరోగ్యంతో అమ్మాయిలతో సమానంగా ఆడుతూపాడుతూ తుళ్ళిపడుతుంటే బాగుంటుందా ఆలోచించుకో. ఎవరు కావాలంటే వాళ్ళు ఎప్పుడు కావాలంటే అప్పుడు నిరభ్యంతరంగా వస్తూ పోతూ వుండవచ్చు. అక్కడైతే నువ్వొక్కడివే ఆమె సంతానం. ఇక్కడ ఇంతమంది పిల్లల బాగోగులు తన భుజాల మీద వుంది. తను ఇక్కడ వంటరిది కాదు. మేమందరమూ ఆమెకు ఎల్లప్పుడూ తోడునీడగా వుంటామని నీకు భరోసా ఇవ్వగలము. ఆలోచించండి."

"అవును ఆంటీ. ప్రత్యక్షంగా చూస్తే కాని కొన్ని విషయాలు అర్థం కావు. నిజంగానే అమ్మను ఈ విధంగా చూస్తూ వుంటే కళ్ళకు పండుగలాగా వుంది."

"ఆఁ ఇంకొక విషయం సందీప్. ఇన్నాళ్ళూ మీ అమ్మ నిద్రమాత్రలతో పాటు ఏవేవో అనారోగ్యాలకు మందులు మింగుతూ కాలక్షేపం చేసేది కదా! ఇప్పుడు ఈ ఆటలూ పాటలు కాలక్షేపమే మీ అమ్మ మింగుతున్న మందులు."

రెండురోజులూ గడిపి తిరుగు ప్రయాణమైన వారికి నవ్వుతూ ఆనందంగా వీడ్కోలు చెప్పుతున్న తల్లిని నిండుగా చూసుకున్నారు కొడుకూ,కోడలూ.

***(సమాప్తం)***

Post your comments